

# అమ్మ

దీర్ఘాశి విజయభాస్కర్

**గోపాలరావుకి గొప్పగా సన్మానం అయింది. అతనేం కవిత్వం రాయలేదు. కుస్తీలు పట్టలేదు. పాటలు పాడలేదు. ఆటలు ఆడలేదు. అంతకన్నా మంచిపనే చేసాడు. అందుకే సన్మానం చేసారు.**

ప్రభుత్వానికి పన్ను కట్టాడు. ఆదాయపు పన్ను కట్టాడు. గత పదేళ్ళనుంచీ క్రమం తప్పకుండా ఆదాయపు పన్ను కట్టినందుకు పదిమందికి సన్మానం చేసారు. అందులో గోపాలరావు ఒకడు.

సన్మానం అయ్యాక ఇంటికొచ్చాడు. వచ్చేదారిలో ఓ పట్టుచీర కొన్నాడు భార్య కోసం. ఆ పట్టుచీర ఇచ్చి తన సంతోషాన్ని భార్యతో పంచుకుందామనుకున్నాడు. కానీ అతని భార్య ఎందుకో ఆరోజు సంతోషంగా లేదు. చేతికిచ్చిన చీర చూడకుండానే కింద పడేసింది. కవరు కూడా విప్పలేదు. బెడ్ మీద ఒక మూలకు ముఖం అటు తిప్పుకుని కూచుంది.

మాట్లాడించాలని ప్రయత్నించాడు. నవ్వించడానికి తాపత్రయపడ్డాడు.

ఉహుఁ...!

ఏదో జరిగిందని అర్థమయింది. ఏం జరిగిందో తెలుసుకోవాలి.

"అమ్మా! అమ్మా!" రంకెలు వేసుకుంటూ వెళ్ళాడు తల్లి ఉన్న గదివైపు.

తల్లి కొడుకుని చూసింది. ఆప్యాయంగా చూసింది. అప్పుడే పుట్టిన పసికందుని చూసినంత ఆప్యాయంగా చూసింది.

తల్లి చూపుకి ఆప్యాయత తప్ప ఇంకోటి తెలియదేమో! కానీ, కొడుకు కోపంగా ఉన్నాడు. చాలా కోపంగా ఉన్నాడు.

"శ్రీదేవిని ఏమయినా అన్నావా?"

"నేనేమన్నాను?"

"మరెందుకు అలిగింది? ఎందుకు కోపంగా ఉంది? పట్టుచీర తెచ్చినా పన్నెత్తి మాట్లాడలేదు. నువ్వేమీ అనకుండానే అంత కోపం ఎందుకొస్తుంది దానికి?"

శ్రీదేవి కూడా వాళ్ళ దగ్గరకొచ్చింది.

"ఆవిడేమీ అనదులెండి! చెయ్యాల్సిన పని చేసుకుపోతుంది. నేనంటే ఒక లెఖ్ఖా, జమా!" అని మూతి మూడువంకర్లు తిప్పింది.

"ముసలి గబ్బిలం ఏంచేసింది డాలింగ్!"

కోపంగానయినా మాట పెగిల్చినందుకు సంతోషపడ్డాడు గోపాలరావు.

అత్తను గబ్బిలం అన్నందుకు ఎంత సంతోషం శ్రీదేవికి. నవ్వాగింది కాదు. కానీ నవ్వితే నవ్వులాట గొడవైపోతుంది. అందుకు నవ్వాపుకుంది.

"ఈ నెల్లోనే ఇన్‌కంటాక్సు కట్టాం కదా"

"అందుకేగా ఈరోజు సన్మానం"

"ఎలక్ట్రిసిటీ బిల్, టెలిఫోన్ బిల్, పిల్లల స్కూలు ఫీజులు అన్నీ ఈ నెల్లోనే. పైగా ఫ్లాట్ ఇన్‌స్టాల్‌మెంటు కూడా కట్టాలి. ఫైనాన్స్ కంపెనీ డ్యూస్ సెటిల్ చెయ్యాలి"

"అవును!"

"ఏం కొంపమునిగిందని ఇవన్నీ ఉండగా మున్సిపాల్టీ పన్నులు కట్టేసిందో అడగండీ! పైగా మూడు సంవత్సరాల డ్యూస్ ఒక్కసారే. ఎంత చెప్పినా వినదే. బీరువాలోంచి డబ్బు తీసి కట్టేసింది. మీకేమో కర్ర విరగ్గొడదు. పాము చావకూడదు. నాకెందుకు మధ్యలో. ఈ ఇంట్లో నా స్థానమేమిటో చెబితే నా పరిధిలో నేను బతుకుతాను. నాకెందుకు అనవసర పెద్దరికాలు"

భార్య మాటలింకా పూర్తికాముందే తల్లి మీద పడి జుత్తు పట్టుకుని గుంజాయించి నాలుగు బారలు ఈడ్చేసి, పీక గట్టిగా మూడు తిప్పులు తిప్పి....

"తల్లివయినందుకు చెయ్యి చేసుకోలేదు. నీకెందుకే అధిక ప్రసంగం. పెట్టింది తిని మూల కూర్చోక" అని భార్యవైపు తిరిగి-

"ఈసారి దానికి చనువిచ్చి చంకనెక్కించుకున్నావో నిన్ను తంతాను జాగ్రత్త!" అన్నాడు.

"నేనేం చేసాను మధ్యలో"

"ఏం చేసావా? నాకెందుకు చెప్పడం! నువ్వే నాలుగు పీకొచ్చుగా! నువ్వు తంతే ఏ గొడవా ఉండదు. అత్త అనందే కోడలు కొడుతుందా అంటారు. అదే నేను ఇంత అంటే అంత అంటారు."

"సర్లెండి! మీ అమ్మ మీద ఫిర్యాదు చేసిన పాపానికి నేనే శిక్షించుకుంటాను. రెండు పూటలు భోజనం మానేస్తాను."

"మానెయ్! కానీ నువ్వు తినడం కాదు. దానికి పెట్టడం. రెండు రోజులు తిండి లేకపోతే చచ్చిపోదు. నువ్వు పద. పట్టుచీర కట్టుకుందువుగానీ." నడుంమీద చెయ్యివేసి భార్యను తీసుకెళ్ళాడు గోపాలరావు.

కళ్ళనిండా నీళ్ళు- గుండెనిండా ఆవేశం తల్లికి.

"ఒరేయ్! మూర్ఖుడా! పెళ్ళానికి పట్టుచీర పెట్టేవాడు కాదురా! అమ్మకి అన్నం పెట్టేవాడురా గొప్పవాడు. పొద్దుపొడిస్తే నీ చెత్తా, చెదారం ఎత్తి, రోడ్లు ఊడ్చి, కాలువలు శుభ్రంచేసి నీకు నీళ్ళిచ్చి, లైట్లేసి, రోడ్లు వేసిన మున్సిపాల్టీ నీ అమ్మతో సమానం. దానికి పన్ను కట్టేవాడురా గొప్పవాడు. అందుకే మూడు సంవత్సరాల బాకీ ఒక్కసారే కట్టేసాను. నువ్వేంట్రా నాకు భోజనం పెట్టొద్దని చెప్పేది. నేనే మానేస్తున్నాను. నేనే మానేస్తున్నాను.

కొడుకు చేతిముద్ద తినాల్సింది ఆ చేతి దెబ్బ తిననంతవరకే. ఇకనుండి నువ్వు పెట్టిన అన్నం విషంతో సమానం. ఆ విషం నేను తినను. తిననుగాక తినను" అని పిచ్చిగా అరుస్తోంది ఆ తల్లి.

అవేమీ విన్పించుకోకుండా పెళ్ళానికి పట్టుచీర కట్టబెడుతున్నాడు కొడుకు.

రేపు అత్తను ఎలా తిట్టించాలో కొత్త కారణం కోసం ఆలోచిస్తోంది శ్రీదేవి.

**నువ్వేంట్రా నాకు భోజనం పెట్టొద్దని చెప్పేది. నేనే మానేస్తున్నాను. నేనే మానేస్తున్నాను.**

**కొడుకు చేతిముద్ద తినాల్సింది ఆ చేతి దెబ్బ తిననంతవరకే. ఇకనుండి నువ్వు పెట్టిన అన్నం విషంతో సమానం. ఆ విషం నేను తినను. తిననుగాక తినను" అని పిచ్చిగా అరుస్తోంది ఆ తల్లి.**

